


# దీపావళి

కె. ఎస్. వి. నరసింహం

ఏడాది కోమారు వచ్చేది. ఎప్పటిలా ఈ ఏడాది కూడా వచ్చింది. ఆ రాకతో జీవితం ఎంతగానో పెనవేసుకుని ఉంది. ఇంటింటా ప్రతి ముంగిటా ఆ చల్లని చూపులే పరుచుకున్నాయి. ప్రతి గుండెలోనూ ఆ కాంతులే గూడు కట్టుకున్నాయి. కాని ఆ ఇల్లు, ఆ ముంగిలి, ఆ గుండె మాత్రం కుంగిపోతున్నాయి, మరి.

ఏడాదికోమారు ఏమరకుండా వచ్చే దీపావళీ! ఎప్పటిలా ఈ మారూ వచ్చావు. నా జీవితం నీ రాకతో ఎంతో పెనవేసుకుని ఉంది.

ఇంటింటా, ముంగిట ముంగిటా నీ చల్లని చూపులే వెలుగుతున్నాయి.

గుండెగుండెలోనూ నీ కాంతులే గూళ్ళు కట్టుకుంటున్నాయి. కాని, నా ఇల్లు, నా ముంగిలి, నా గుండె లోలోపలే కుంగిపోతున్నాయి, దీపావళీ, కుమిలిపోతున్నాయి.

* * *

అది చాలా దుర్భరమైన జ్ఞాపకం. నాకు గుర్తున్న నీ మొదటి రాక. నాడు నీ సంతోషకరమైన ఆగమనానికి నా చిన్ని చిన్ని చేతులతో కాకరపువ్వొత్తులు కాల్చి స్వాగతం పలికాను. నాన్న నన్ను ఒళ్ళో కూచోబెట్టుకుని నా చేత మతాబాలు కాల్పించడంకూడా నాకు బాగా గుర్తే!

ఆ నీ రంగురంగుల కాంతులలో నాన్న ఏమిటాలోచించాడు? నన్ను నాన్నచేతుల్లో పెట్టి కన్నుమూసిన అమ్మను గురించా? ఆడపిల్లను నేనైనందుకు, నాన్నమీద పడిన, నన్ను మోయవలసిన బరువును గురించా?

అప్పుడు, నా కిప్పటికీ కళ్ళకు కట్టినట్టుంది, నాన్నలోతుకళ్ళలో ప్రతిఫలించిన వి నీ నవ్వుపువ్వుల వింతవెలుగులే! ఆయన బేలచూపులలో సుళ్ళు తిరిగినది వేదనే, వేదనే!

ఆ రాత్రి, ఎంతకీ నిదురపట్టని నాన్న తెలతెలవారేవేళ వరకూ నా వెన్ను నిమురుతూనే ఉండి, తన భయాన్ని మూగభాషలో నాకు తెలియజెప్పడమూ నేను మరిచిపోలేదు.

దీపావళీ! ఆ నాడు నా తెలియని తనంలో నన్ను విపరీతంగా, వింతగా










కలవరపెట్టినవి టపాకాయల ఢమ ఢమలే!

తరవాత, ఆ తరవాత మరో మారు నువ్వు వచ్చినప్పుడు, నాకో కొత్తగౌను కొనివ్వలేని నాన్న, నాలుగు టపాకాయలైనా నా చేతుల్లో పెట్టలేని నాన్న వీథి అరుగుమీద చలనం లేకుండా కూచుంటే, తెలియనితనంతో వేనవి కావాలని, కావాలని మారాం చేస్తే, సర్ది చెప్పలేక, ఇంకేమీ చేతగాక నా వీపు వాయగొట్టింది, చేతులు నొప్పులెత్తేలా బాదింది నాన్నే! కాని, ఆ తరవాత చేసిన అపరాధమేమిటో తెలుసుకోలేక, ఇరుగింటి, పొరుగింటి పిల్లలు సంతోషంతో గంతులు వేస్తున్నవేళ నేను కళ్లలో నీళ్లు నింపుకుంటే, నన్ను చూసి, నా కంటి నీళ్లతోబాటు చెక్కిళ్ల మీదుగా జారిన నీ చల్లని కాంతులను చూసి, నన్ను వాటేసుకుపోయింది నాన్నే! అప్పుడు, అయ్యో, తన గుండెలోని అంతులేని బాధనూ, దుఃఖాన్నీ నాకు పంచిపెట్టింది నాన్నే!

అప్పుడు నీ చిత్రమైన వెలుతురులలో నాన్న పెదవులమీద మెరిసి మాయమైంది అర్థంలేని వెర్రినవ్వే!

అప్పుడు వీథివీథంతా మార్మోగుతూ నువ్వు చేసిన ధనధన చప్పుళ్లు నాకేం చెప్పాయి?

కాని కాని, మరో పదేళ్లకి నా ఎదపైని ఎద, పయ్యెద నన్ను చిలిపిగా అల్లరి పెడుతూంటే చీకటిలో మగ్గిన నా బ్రతుకుకు మరో ఆశాకిరణం చూపించావు.

నువ్వు నన్ను పలకరించవచ్చిన ఆ నాడే ఆయన్ని మా ఇంటికి పంపావు. తల్లీ, తండ్రీ లేని దూరపుచుట్టం, నాకు బావ వరస — నాన్నెంత పొంగిపోయాడు! పొద్దుటే అతణ్ణి చూసిన నేను నాకు తెలియకుండానే ఎంత సిగ్గుపడి పోయాను! సంజెవేళ ఇంటిముంగిట నేను ప్రమిదలలో నూనె పోసి దీపాలు వెలిగిస్తూంటే, తెల్లతెల్లటి బట్టలలో నా పక్కనే నవ్వుతూ నిలుచున్న ఆయన రూపు... కాకరపువ్వొత్తులు కాల్చుకుంటున్న నన్ను అదేపనిగా చూసిన ఆయనచూపు అమ్మో! ఆ అర్థంకాని ఆనందం నన్నుక్కిరిబిక్కిరి చేసి, ఇకముందంతా సంతోషమని ఎన్నెన్ని మూగపిల్లనగ్రోవులు నా లోలోపల మ్రోగాయి! అప్పుడు నా ఎడదంతా చోటు చేసుకుని నన్ను గిలిగింతలు పెట్టినవి నీ బంగరురంగుల వెలుగులే!

నువ్వు నన్నావిధంగా వాత్సల్యంతో పులకరింపజేసిన ఆ రాత్రే, పెరట్లో

పొగడచెట్టు నీడన, అక్కడా మసకమసగ్గా వెలిగిన నీ నవ్వులలో, చిన్నగొంతుకతో గుసగుసగా ఆయన చేసినవన్నీ బాసలే! అన్నాళ్ళూ నాలో నిదురించి అప్పుడు మేల్కొన్నవి ఆశలే.

అప్పుడు మా పెళ్ళికి అంగీకరించిన నాన్న కళ్ళనుండి వెలికుబికిన వెచ్చవెచ్చటి కన్నీటిచుక్కలలో నిగ్గులుదేరి నవ్వి, ఆనందకిరణాలు వెదజల్లినది గూటిలో నిశ్చలంగా వెలుగుతూన్న దీపంకళికలో దాగిన నీ జాలిజాలి గుండెయే!

మరుసటి ఏడాది నువ్వు రాగా వరసలు వరసలుగా ప్రమిదలు పెట్టి, నీ పట్ల నా కున్న అనురాగాన్నంతా నూనెగా పోసి, ప్రేమను వత్తులుగా వేసి వెలిగించాను.

ఏమీ లేనితనంలో అన్నింటినీ చూసుకుని మహాసంతృప్తితో మురిసి మురిసి నాలో నేను మూగపాటలు పాడుకున్నాను. అప్పుడు నిర్మలమైన ఆనందంతో వెలిగిన నా గుండెదీపం నీకు నిశ్శబ్దంగా నివాళి ఇచ్చే ఉంటుంది.

అప్పుడు, ఆ నాడు ఆయనా నేనూ కలిసి బాణసంచా కాలుస్తుంటే చూసి కనులపండువైనట్టు సంబరపడినవాడు నాన్న!

అప్పుడు నీ కోమలమైన చేతుల స్పర్శతో సంతృప్తిగా నిశ్వసించినవాడు నాన్న!

ఆ రాత్రి డాబామీద పక్క వేసుకుని ఆయనా నేనూ ఒకరి కొకరు ఆనుకుని కూచుని ఉన్నప్పుడు, మాకు శుభాకాంక్షలు చెప్పినవి నీవు చేసిన చప్పుళ్ళే!

ఆ రాత్రే చాలా పొద్దు పోయాక, నే నాయన కళ్ళలోకీ, ఆయన నా కళ్ళలోకీ చూసుకుంటూ నీవు పవిత్రంగా దొర్లించిన ఘడియల ప్రభావంలో కరిగిపోతున్నప్పుడు, పక్కవీథిలో ఎక్కడో 'ఢా'మ్మని టపాకాయ చప్పుడు విని పించగా, ఉలికిపడి భయంతో నే నాయనను కౌగిలించుకున్నప్పుడు, కౌగిలి మరింత బిగించి, నందిటిలో హత్తిహత్తి, గుండెలు నలిగిపోయేలా అదిమిపట్టి, గుసగుసగా, అస్పష్టంగా "రోజురోజూ ఒక దీపావళి అయితే ఎంత బావుణ్ణు. . ." అన్న ఆయన మాటలను నేను మరిచిపోగలనా, దీపావళీ?

ఆ రాత్రి నా కంతటా ఆనందమే.

అంతటా చుక్కదీపాలతో సింగారించుకుని నన్నాశీర్వదించింది అప్పు డాకాశమే!

నా కప్పు డెక్కడ చూసినా కనిపించినవి నీ దివ్యకాంతులేనే, దీపావళీ!

కాని, ఆ తరవాత మరోమారు నువ్వు వచ్చినప్పుడు ఇల్లంతా చీకటే!



"బరకగా ఉండే పాత కాలపు పళ్ల పొడులు మీ చిగుళ్లకు పళ్లకు చెరుపు చేస్తాయి..."

# కాల్గేట్ టూత్ పౌడరుతో మీ చిగుళ్లను, పళ్లను కాపాడు కోండి. చెడు శ్వాసను అరికట్టండి !

పాతకాలపు బరకగా ఉండే పళ్ల పొడులు మీ చిగుళ్లకు, దంతాలకు చెరుపు చేస్తాయి, పళ్లపై నుండే ఎనామెలును అరగదీస్తాయి. కాల్గేట్ టూత్ పౌడరు అతి మెత్తగా ఉంటుంది. దాని లోని నునుపు నిచ్చు పదార్థం మీ పళ్ల మీది పాచి పొరలను తొలగిస్తుంది. వాటిని తెల్లగా శుభ్రంగా చేస్తుంది. అది మీ చిగుళ్లను మృదువుగా తోముతుంది. కాల్గేట్ లోని పుష్కలమైన నురుగు నిచ్చే చర్య పళ్ల సందుల లోనికి చొచ్చుకొనిపోయి చెడు వాసనను, దంతక్షయ కారకములైన సూక్ష్మక్రిములను తొలగిస్తుంది. అందువల్లనే, కాల్గేట్ టూత్ పౌడరు చెడు శ్వాసను తక్షణమే అరికట్టి, దంతక్షయమును నివారిస్తుంది. దాని చల్లని, ఉల్లాసకరమైన రుచిని మీరెంతో మెచ్చుకుంటారు కూడా!

...పొదుపైన అధునాతన దంత సంరక్షణ ఉండగా, పాత కాలపు పళ్ల పొడి వాడటం దేనికి!

మీ కుటుంబం కోసం, ఎకానమీ సైజు కాల్గేట్ టూత్ పౌడరు కొనండి ఈ నాడే! నెలల తరబడి వస్తుం దొక డబ్బా!

...పరిపూర్ణ దంత సంరక్షణ కోసం వాడండి, శాస్త్రోక్తముగా రూపొందింప బడిన కాల్గేట్ టూత్ బ్రష్




TP. G. 19 TL

# దక్షిణ భారత తక్షశిల కొండాపురం

దక్షిణ భారత దేశపు తక్షశిల అని పేర్కొనబడిన కొండాపురం మెదక్ జిల్లా సంగారెడ్డి తాలూకాలో, హైదరాబాదు పట్టణానికి 43 మైళ్లదూరంలో ఉంది.

ప్రాచీనకాలంలో, అనగా షుమారు రెండు వేల సంవత్సరాల క్రిందట, ఇది ఒక రాజధానీ నగరమై విలసిల్లినది.

ఇక్కడ పురాతనమైన ఎన్నో దిబ్బలు ఉన్నాయి. పురాతత్వ శాఖ వారు జరిపించిన త్రవ్వకాల మూలంగా అనేక చారిత్రక విశేషాలు బయటపడ్డాయి. ఇక్కడ మూడు విహారాలు, స్థూపాలు, చైత్యాలు బయటపడ్డాయి. 15 అడుగుల వ్యాసం కలిగి ఉన్న స్థూపం, దీని చుట్టూ ఇటుకలు, కాంక్రీట్‌తో చేయబడిన వాకిలి కనుగొనబడింది. దాని క్రింద కొన్ని గదులు, అందులో కొన్ని కొలువులు ఉన్నాయి.

ఈ ప్రదేశంలో చిత్ర విచిత్ర మృణ్మయ పాత్రలు, అనేక విగ్రహాలు, కొడవళ్లు, గొడ్డళ్లు, బాకులు, కంఠహారాలు, కర కంకణాలు మున్నగునవి ఎన్నో లభించాయి. ఇక్కడ 23,391 పూసలు లభించాయి. అందులో 22 వేలు మట్టిపూసలే! రాగి, స్ఫటికం, శంఖము, కెంపులతో తయారుచేయబడిన పూసలు కూడా దొరికాయి. ఈ పూసలలో వృషభాకారపు పూస పేర్కొనదగింది.

వెండి, రాగి, తగరం, సీసపు నాణాలు షుమారు నాల్గు వేలు లభించాయి. ఈ నాణెములను తయారుచేయడానికి ఉపయోగించే మూసలు కూడా కనిపించాయి. రోమన్ చక్రవర్తి ఆగస్టస్ (క్రీ. పూ. 37–క్రీ. శ. 14) బంగారు నాణెం ఒకటి కనిపించింది. ఈ నాణెములలో కొన్ని శ్రీ గౌతమీపుత్ర శాతకర్ణి, శ్రీ వాసిష్ఠీ పుత్ర పులమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి మున్నగు నామములు కల ఆంధ్ర రాజపుంగవులకు చెందినవి.

కొన్ని మనోహర శిల్పమూర్తులు కూడా దొరికాయి. అందులో ఒక స్త్రీ మూర్తి తన తొడపై పాపను కూర్చుండబెట్టుకొన్నట్లు చెక్కబడింది. ఒక శిల్పం బోధిసత్త్వుని మూర్తిగా గుర్తించబడింది. కొన్ని పాత్రలకు ఎరుపూ, పసుపూ, నీలం రంగులు పూత పూశారు.

ఇక్కడ పూసల పరిశ్రమ వర్ధిల్లినట్లు మనకు ద్యోతక మగుచున్నది.

ఈ పట్నణం క్రీ. పూ. 300 సంవత్సరాల నుండి క్రీ. శ. 200 వరకూ—అనగా అయిదు వందల సంవత్సరాలు సకల సంపద్వైభవములతో, జనాకీర్ణమై వెలుగొందినట్లు చరిత్రకారులు అభిప్రాయపడు చున్నారు.

ఇంకనూ ఇక్కడ పరిశోధనలు కొనసాగించిన, ఆంధ్రుల పురాతన చరిత్రకు సంబంధించిన అనేక విషయాలు తెలియగలవు.

మన ఆంధ్రుల నాగరికత, సభ్యత, సంస్కృతి, రెండు వేల ఏండ్ల క్రిందట ఎట్లా ఉండేదో, ఇక్కడ లభించిన వస్తు సముదాయం వలన తెలియగలదు.

బౌద్ధమతానికి నిలయమై, విజ్ఞానాన్ని వెదజల్లిన ఈ కొండాపురం 'దక్షిణ తక్షశిల' అని నుతించబడడంలో ఆశ్చర్యం లేదు.

**— ఇందుకూరి సత్యనారాయణరాజు**

అప్పుడు నల్లబారిన గుండెలతో బోసిగా ఉండి ఏడుపుమొహాలతో నన్ను చూసినవి ప్రమిదలు లేని గూళ్లే!

అమ్మ లేని లోటు తీర్చి, నన్ను పెంచి, బ్రతుకుమీద ఆశలను నాలో నిలిపిన నాన్న కొద్దిరోజులముందే కన్నుమూయగా ఇంకా నా కెక్కడి పండగ? ఇంకా నా కెక్కడి వేడుక?

ఆ నాడు నిన్ను నే పిల్లలికి, ముగ్గులు తీర్చి, దీపాలు వెలిగించి ఆహ్వానించలేదని చిన్నబుచ్చుకున్నావా?

లేదు, లేదు, జాలికమ్మల దీపావళీ! దయామయీ! నీకు నా మీద కోపం రాదు. నేను నీ బిడ్డనే. ఆ రోజు చీకటి కొట్లో నాన్నను తలుచుకుని, తలుచుకుని వెక్కి వెక్కి ఏడ్చిన నన్ను వెచ్చవెచ్చటి చిట్టిగాడ్పులతో విసిరి, ఓదార్చి, బుజ్జగించిన నీ ఆప్యాయత నిండిన చేతలను నే నెలా మరిచిపోగలనమ్మా!

అప్పు డిక నాకు మిగిలిన పెన్నిధీ, నా సర్వస్వమూ అయిన 'ఆయన' గుండెల మీద తల ఆన్చి, నాలో పెరుగుతున్న మా దాంపత్యఫలాన్ని తలుచుకుని నన్ను నేనే సమాధానపరుచుకున్నాను.

ఆ మాత్రం ఆలంబనలు చాలుననీ, నా జీవనలత వాడి, నలిగి, వాలిపోయే ప్రమాదం ఉండదనీ ఊహించుకున్నాను.

కాని, దీపావళీ! నా ఆశలు ఆరిపోయిన చిచ్చుబుడ్లౌతాయని నే ననుకోలేదు.

దిక్కుతోచని, సాయం దొరకని శోకపు వడిసముద్రంలో నన్ను విడిచిపుచ్చి ఆయన ఏ లోకాలకో వెళ్లిపోతే నా గుండె ఏమై పోవాలని?

ఆరేళ్లప్పుడు నువ్వు వచ్చినప్పుడు తెల్లారగట్లే లేచి, పిల్లడికి తలంటిపోసి ఆయన కోసం ఎదురుచూస్తూ కూచున్నాను. క్షణాలు నిమిషాలై, నిమిషాలు గంటలై గడిచాయి. పొరుగూరినుండి ఆయన రాలేదు.

సాయంత్రం ముగిసి చీకట్లు మూగిన వేళ దీపాలు వెలిగించి పిల్లడిచేత మతాబాలు కాల్పిస్తుంటే వాకిట కనిపించిం దేమిటి?

ఆయన శవం!

తంతిస్తంభాలెక్కి తీగలు సరిచేసే ఆ ఉద్యోగం అంత ప్రమాదం తెచ్చిపెట్టగలదని నేను భయపడినంతా జరిగిపోయిందే! లోకానికి వెలుతురులను పంచే కరెంటు నా పైని చీకట్లు కుమ్మరించి ఆయన్ను బలిగొన్నదే!

అయ్యో! దీపావళీ!

ఆ పూట నా కెక్కడ చూస్తే అక్కడ కనిపించింది చీకటేనా? చీకటేనా? నల్లనల్లటి నీడలేనా? నీడల వెనక మంటలేనా? మండి మండీ మింటిదీపపు చుక్కలంటే సాగినాయని మంటలేనా?

బ్రతుకు దీపం ఆరిపోయీ, చితికిపోయిన కాంతిపుంజా లయ్యాయో, ఇక ఆతుకుతాయా?

నాడు...

లోకానికంతా వెలుగుపువ్వులు రాల్చి, నా తలపైని మాత్రం నిప్పురాళ్లే విసిరినా వేమయ్యాయో, దీపావళీ!

అప్పుడు నే విన్నవల్లా ఘోషలే! పెనుఘోషలే!

అప్పుడు నా కలలందు నిండినవి అమ్మయ్యో, అవి పీడలే!

నాటినుండీ నేటివరకూ నిదురలో నిలిచేవి, నన్ను నిలవేసి బాధించేవి కలతలు కలతలే!

ముక్కుపచ్చలు ఆరని పిల్లడి భవిష్యత్తు ఏమిటి?

అయోమయంగా నీళ్లింకిన కన్నులతో ఏమని బ్రతకను? నేను?

నవ్వుతావా! నవ్వుతావా! నా అభాగ్యపు కథ విని!

ఏ మమ్మా దీపావళీ! ఇదంతా నీచలవే!

ఏమి టది? ఎవ రది "అమ్మా!" అని అరుస్తున్నది?

అమ్మో అమ్మో!. . .

* * *

టపాకాయ పేల్చబోయి పిల్లడు చెయ్యి కాల్చుకున్నాడు. కట్టు కట్టి, బుజ్జగించి, నిద్రపుచ్చాను.

దీపావళీ! నిజం, కూటికిలేని పేదలకు కులాసాల పండగ లెందుకు?

ఇదిగో, అమాయికంగా, నిద్రిస్తున్న ఈ పసివాడికి రేపుమీద చింత లేదు.

కాని, నా కున్నదమ్మా!

వీడి భవిష్యత్తును దిద్దట మెలా?

అయ్యో! ఇంత రాత్రి అయింది. . . నేను గమనించ లేదు.

దీపాలు కొడిగట్టి వెలుగుతున్నాయి. వీథులన్నీ ప్రశాంతంగా నిద్రపోతున్నాయి.

అదిగో! అదిగో! ఈ పేరు కున్న నిశ్శబ్దంలో వెళ్లిపోతున్న నీ అడుగుల చప్పుడు నాకు వినిపిస్తూంది.

పోయిన మారు నీ రాకకూ, ఈ మారు రాకకూ ఎంతో తేడా లేదు. కాని, వచ్చేమారు నువ్వు నా బ్రతుకులో కొత్త కాంతుల్ని నింపగలవని ఆశించమన్నావా, దీపావళీ!

దీపావళీ! సౌందర్యమయీ!

నీ రాక ఎద లోలోపలి తంత్రులను మీటుతుంది.

ఎన్ని నీడలున్నా, ఎన్ని మంటలున్నా నీ పలకరింపుతో మనసు పులకరిస్తుంది కాదటమ్మా!

నిన్ను చూస్తే కనులు చెదురును కాదటే, దీపావళీ!

నిన్ను చూస్తే ఎడద రగులును కాదటే, దీపావళీ!

అదిగో! ఊరంతా సద్దుమణిగినా నా వంటి ఉన్మాదే ఎవరో పేల్చిన టపాకాయ నీ ఒక్క రోజు పలకరింపుతో ఆఖరి క్షణంగా, నీ నిష్కృతి సూచకంగా పేలింది.

ఇదిగో! ఈ గాలిలో నీ మెత్తటి నిట్టూర్పుల చప్పుడు మెల్లగా, మెల్ల మెల్లగా వినిపిస్తున్నది.

**వెళ్లిపోతున్నావా, దీపావళీ!**
**అయ్యయో! దీపావళీ!**
**దీపావళీ!**
**దీపావళీ!** ★